క్లుప్తంగా

'వైనాట్ 175'కు మద్దతుగా పాదయాత్ర



యడ్లపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఏపీ వైనాట్ 175 నినాదంతో.. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేస్తున్న బసవరావు బృందం ఆదివారం మండలానికి చేరుకుంది. బోయపాలెం, పార్వతీపురం వైఎస్సార్ సీపీ శ్రేణులు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ స్వాగతం పలికారు. వి శ్రీనివాసనాయక్, బోడా వెంకటప్పయ్య, ఆర్.శివానాయక్, ఎం.గోపీనాయక్, వి.లక్ష్మణ్‌నాయక్, ఇర్లపాటి నాని, షేక్ బుడే, వి భద్రనాయక్ ఉన్నారు.

కారుమంచి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు



శావల్యాపురం: కారుమంచి గ్రామంలో సీతారామస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం రెండోవ రోజు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మహా కుంభ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, క్షీరాదివాసం విశేష పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 29 తేదీతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. బాల కృష్ణమాచార్యులు సారథ్యంలో అర్చకులు కొడవటికంటి కృష్ణమాచార్యులు, మోహనరంగాచార్యులు, ఆదిత్య కుమార్ ఆలయ పునఃప్రతిష్ఠా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): త్రిపురాపురం గ్రామంలో బాలవికాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను విజయవాడ కనదుర్గ దేవస్థానం బోర్డు మెంబరు జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గ్రామస్తుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు 500 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభాకరరెడ్డిని సర్పంచ్ గొట్టం బ్రహ్మారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎ. రామాంజిరెడ్డి, జి.బ్రహ్మారెడ్డి, టి.కృష్ణారెడ్డి, కె.హనుమంతరావు తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఈపూరు : శివరాత్రి పండగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ సభ్యులు కొచ్చర్ల గ్రామంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల విశిష్టతను వివరించారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి.. జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవజ్ఞానం తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, సభ్యులు రామాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యం, పోట్లూరి పుల్లయ్య, స్వర్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

సాతులూరులో ఉచిత వైద్య శిబిరం



నాదెండ్ల: సాతులూరులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నరసరావుపేట వరబాబు సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గంగూరి సుప్రజ, చెరుకూరి రవితేజ, యలవర్తి వరబాబు సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. డాక్టర్లను స్థానికులు సత్కరించారు. సాతులూరు ఆర్‌ఎంపీ ఓగూరి శ్రీనివాసరావు, ఐనవోలు రాధాకృష్ణమూర్తి, పసుమర్తి శివనాగేశ్వరరావు, హనుమంతరావు, రాజా, తెల్లాకుల అనిల్‌కుమార్, సత్యనారాయణ, మణిదీప్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

నరసరావుపేట రూరల్: ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం అల్లూరివారిపాలెంలో ఆదివారం నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అంటూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో ర్యాలీ చేశారు. ప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్స అందించడం, విద్యుత్ షాక్, గుండెపోటు, నీటిలో మునిగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన సీపీఆర్‌పై గ్రామస్తులకు వివరించారు. ఈదర గోపిచంద్, కోడెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల సంక్షేమానికి కృషి

ముస్లింల సద్భావనా కమ్యూనిటీ హాలు ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు గడిచిన ఐదేళ్లలో స్వయంగా, పార్టీ పరంగా అండగా ఉంటూ వారి సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కృషి చేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెద్దచెరువులోని ముస్లింల సద్భావనా కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించారు. కమ్యూనిటీ హాలుకు రూ.30లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్, మార్కెట్ యార్డు పదవులు మైనార్టీలకు అందజేశామన్నారు. అంజుమన్ కాంప్లెక్స్‌ను టీడీపీ ప్రభుత్వంలో కూల్చేశారని, దీంతో ఐదు మసీదులకు చెందిన ఇమామ్, మౌజమ్, విద్యుత్ ఖర్చులకు నిధులు లేకుండా పోయాయన్నారు. వక్ఫ్‌బోర్డు నుంచి రూ.50లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గోపిరెడ్డి తెలిపారు. విద్యుత్ ఖర్చులకు తనూ షేక్ ఖాజావలి మాస్టారు కలిసి రూ.2లక్షలు చెల్లించామన్నారు. కాంప్లెక్స్‌పై కోర్టులో వేసిన ఏడు కేసులను విరమింపజేస్తే మళ్లీ కేసులు వేశారని గుర్తుచేశారు. జామియా మసీదు నిర్మాణానికి తాను రూ.10లక్షల నగదు ఇచ్చానన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మసీదు నిర్మాణానికి సహకరించామన్నారు. ఆటో నగర్ కోసం 19 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించామని, రెండో ఖబర్‌స్తాన్‌కు త్వరలో భూమిపూజ చేస్తామన్నారు. పట్టణంలోని పలు మసీదుల నిర్మాణానికి సొంత నిధులతో సిమెంట్, ఇసుక ఇప్పించామని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్‌ను, ఇక్కడ ఎమ్మెల్యేగా తనకు మద్దతు పలకాలని ముస్లిం సోదరులను కోరారు. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ ప్రకటించిన 69 నియోజకవర్గాల సమన్వయకర్తల్లో ఏడు ముస్లిం సోదరులకు కేటాయించగా, టీడీపీ, జనసేన కలిపి ప్రకటించిన 118 సీట్లు ఒక్క సీటు అయినా ముస్లింలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. ముస్లిం సోదరులు దీనిని గమనించాలన్నారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, వద్దుల సుబ్బారెడ్డి, నిడమానూరి సురేంద్ర, కారుమంచి మీరావలి, షేక్ కరిముల్లా, షేక్ మహబూబుసుభాని, సద్భావనా కమ్యూనిటీ హాలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో వెల్లివిరుస్తున్న సామాజిక న్యాయం

- అన్ని వర్గాలకు సంక్షేమాభివృద్ధి ఫలాలు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: జగనన్న పాలనలో సామాజిక న్యాయం వెల్లివిరుస్తోందని, ప్రతి కుటుంబానికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు దక్కుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. పట్టణంలోని 12వార్డు పరిధిలో ఉన్న తూర్పు మాలపల్లెలో ఆదివారం మన ఊరు- మన రాజేష్ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ జరిగిన అభివృద్ధిని వివరించేందుకు వచ్చిన రాజేష్ నాయుడుకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా మేలు చేస్తున్నది జగనన్న అని తెలిపారు. ప్రభుత్వం చేసిన మేలు వివరించేందుకు వచ్చిన తనకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, ఆత్మీయత చూస్తుంటే జగనన్న పాలన పట్ల ప్రజలు ఎంత సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఒక్క 12వార్డు పరిధిలోనే రూ. 12.30కోట్ల సంక్షేమ లబ్ధి చేకూరిందని వివరించారు. నాన్ డీబీటీ పథకాల ద్వారా రూ.5.37 కోట్లు అందినట్లు చెప్పారు. మొత్తంగా వార్డులో 6,422 మందికి రూ. 17.67 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఇలాంటి అద్భుతమైన పాలన కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యడ్ల ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి మల్లెల అభినందన

నాదెండ్ల: ఏపీ స్టేట్ లెవల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ ఛాంపియన్ షిప్‌లో ఇర్లపాడుకు చెందిన ఈర్నపు దేవకిరణ్ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం అతనిని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పార్టీ మండలాధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి, గణపవరం సొసైటీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, యువజన విభాగం అధ్యక్షుడు జోజిబాబు పాల్గొన్నారు.

పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు నాగేశ్వరరావు, భవ్యతేజ

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విశ్రాంత జేడీ డాక్టర్ మరదాపు నాగేశ్వరరావు అన్నారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బీపీ, షుగర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ మరదాపు నాగేశ్వరరావు, జూనియర్ డాక్టర్లు గుంటుపల్లి భవ్యతేజ, చెన్నిపాటి తేజశ్రీ, శొంటినేని నవ్యశ్రీ 240 మంది రోగులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు తగు జాగ్రత్తలు సూచించారు. అనంతరం క్యాంపులో సేవలందిస్తున్న వలంటీర్లకు సేవ ప్రసంశా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు గోనుగుంట్ల కిరణ్, చెన్నుపాటి పూర్ణచంద్రరావు, ముత్తవరపు రవీంద్రబాబు, కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వర్ ఫెస్ట్



ప్రొఫెసర్ సుబ్బారావును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈశ్వర్ ఫెస్ట్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోస్టర్, పేపర్ ప్రజంటేషన్‌తో పాటు చదరంగం, పరుగు, బాడ్మింటన్, ఫ్యాషన్ షో, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ-కే ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ ఎండీ మస్తాన్‌వలి, లియో గ్లోబల్ ఓవర్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌వీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఆటోమేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్‌పై అవగాహన కలిగి ఉంటే మెకానికల్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం జబర్దస్త్ నటులు రైజింగ్ రాజు, దొరబాబు, పవన్, శాంతికుమార్ కామెడీ స్కిట్స్ అలరించాయి. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, కార్యదర్శి షేక్ కరీమ్ మొహిద్దీన్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సీఆర్ కళాశాలలో ఎ-సర్టిఫికెట్ టెస్ట్



లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్ శర్మకు సన్మానం

నాదెండ్ల: ఎన్‌సీసీ విద్యార్థులు మినీ ఆర్మీతో సమానమని ఆంధ్ర 25వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్ శర్మ పేర్కొన్నారు. గణపవరం చుండి రంగ నాయకులు డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎ-సర్టిఫికెట్ ప్రదానం కోసం రాత, శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. చిలకలూరిపేటలోని గణపవరం, మురికిపూడి, శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు వేద, మద్దిరాల జవహర్ నవోదయ విద్యార్థులు 246 మంది హాజరయ్యారు. థియరి 350, ప్రాక్టికల్స్ 150 మార్కులకు నిర్వహించారు. అనంతరం దీప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటూ ఎన్‌సీసీలో రాణిస్తే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడతాయన్నారు. హవాల్దార్లు, ఏఎన్‌వోలు ఆయనను సత్కరించారు. విద్యార్థులకు భోజన వసతి కల్పించిన గణపవరం జెడ్పీ హైస్కూలు పీఎంసీ చైర్మన్ సూరా శంకర రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఎం జబీర్‌సింగ్, సుబేదార్ మేజర్ జి.మోహిత్, సీహెచ్‌ఎం జశ్బిర్‌సింగ్, హవాల్దార్ హరికృష్ణ, ఏఎన్‌ఓలు షేక్ ఎండీ రసూల్, ఇమ్మానియేల్ రాజు, ఎస్.అప్పారావు, ఎం.లక్ష్మణరావు, విజయకుమార్ నాయక్, పాల్గొన్నారు.

పీఆర్ విజ్ఞాన కేంద్రంలో టైలరింగ్ సెంటర్



విజ్ఞాన కేంద్రంలోని టైలరింగ్ సెంటర్

యడ్లపాడు: కుట్టు శిక్షణ పొందిన మహిళలు తమ వృత్తిని నిర్వహించుకునేందుకు వీలుగా యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో 'టైలరింగ్ సెంటర్'ను ఏర్పాటు చేసినట్లు స్థానిక నారాయణ హైస్కూల్ ప్రిన్సిపల్ చెరుకూరి సృజన తెలిపారు. తానా ఫౌండేషన్ ప్రతినిధి యార్లగడ్డ వెంకటరమణ సహకారంతో విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు మెషిన్లను ఆమె ఆదివారం ప్రారంభించారు. అనంతరం మహిళలతో మాట్లాడారు. పేదల జీవన ప్రమాణాల్లో మార్పు రావాలంటే కుటుంబ పెద్దతో పాటు ఆ ఇంటి మహిళ కూడా తప్పక పని చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కుట్టులో శిక్షణ పొంది, కనీసం కుట్టుమిషన్ లేని మహిళలకు ఈ టైలరింగ్ సెంటరు ఉపయోగపడుతుందన్నారు. కేంద్రం బాధ్యులు నూతలపాటి కాళిదాసు మాట్లాడుతూ దుస్తుల ఆర్డర్లు ఒప్పుకున్న మహిళలు నేరుగా ఇక్కడికి వచ్చి మెషిన్లపై స్టిచ్చింగ్ చేసుకోవచ్చన్నారు. కేంద్రానికి, మిషన్లకు అద్దెలు, విద్యుత్ చార్జీలు ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. టైలరింగ్ వృత్తి చేసుకునే వారి పేర్లు నమోదు చేసుకుని, సౌకర్యాలు కల్పించి ఈ నెల 28న టైలరింగ్ డే నుంచి దీనిని అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరి కృష్ణకుమారి, నూతలపాటి విజయలక్ష్మి, ముత్తవరపు పద్మారావు, రవీంద్ర, కృష్ణ, కేతా రామబ్రహ్మం, గోనుగుంట్ల కిరణ్ ఉన్నారు.

రుణ ఎగవేతదారుల ఆస్తులు జప్తుచేయాలి

నరసరావుపేట టౌన్: ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగ్గొట్టిన కార్పొరేట్ సంస్థల పేర్లను బహిరంగంగా ప్రకటించడంతో పాటు వారి ఆస్తులను జప్తుచేయాలని యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం రామిరెడ్డి పేట సన్నిధి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. యూనియన్ బ్యాంక్ 1946 ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కస్టమర్లకు మెరుగైన సర్వీసులు అందించి, ఉద్యోగుల భద్రతకు కృషి చేయాలన్నారు. డీజీఎం శంకర్‌రావు, చైర్మన్ పి. విజయభాస్కర్, బ్యాంకు ప్రతినిధులు వి. శ్రీనివాసరావు, ఎండీ సయ్యద్ బాషా పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి వేల్పూరు సబ్ స్టేషన్

శావల్యాపురం: వేల్పూరు గ్రామ సమీపాన ప్రభుత్వ భూమి ఎకరం స్థలంలో నూతనంగా రూ.4 కోట్ల వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రారంభోత్సవం చేయనున్నట్లు మండల విద్యుత్ శాఖాధికారి ఎస్.గాంధీ తెలిపారు. ఆదివారం విద్యుత్ సబ్‌స్టేషను నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఐదు వేల నివాస గృహాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. సబ్ స్టేషన్ పరిధిలో అనుసంధానం చేయనున్న గ్రామాల్లో 200 విద్యుత్ స్తంభాలతో పాటు నూతన విద్యుత్ లేన్ పనులు పూర్తి అయినట్లు ఏఈ తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లికార్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమం, సాయంత్రం పరిమి లక్ష్మీనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ, వీరాంజనేయ సువర్చలాదేవి కల్యాణం, అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం విశేష పూజల అనంతరం భారీ అన్నదానం ఉంటుందని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామానికి చెందిన పురోహితులు మల్లాది కోటేశ్వరరావు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన వనిపెంట కోటిరెడ్డి, జమ్ముల వెంకటేశ్వర్లు భార్య బేబీ మృతి చెందారు. వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు తన సోదరుడు మల్లెల కోటేశ్వరరావు ద్వారా రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు.

గీతమ్స్‌లో టాలెంట్ టెస్ట్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గీతమ్స్ ఐఐటీ క్యాంపస్‌లో గీతమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారని విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి తెలిపారు. 3వ నుంచి 9వ తరగతి విద్యార్థులకు టెస్ట్ నిర్వహించామని, త్వరలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్ నగర్‌లోని టౌన్ హాల్‌లో ఆదివారం జానపద కళ మెగా సంగీత కార్నివాల్, సంగీత విభావరి నిర్వహించారు. ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ సభ్యుడు అబ్దుల్ సలామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంగీత కార్నివాల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత కళాకారులు 60 రకాల సంగీత వాయిద్య పరికరాలతో అలరించారు. సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహించారు.

ఘనంగా సీతలాదేవి ఆలయ వార్షికోత్సవం



నరసరావుపేట రూరల్: మండలంలోని పెదరెడ్డిపాలెంలో ఆదివారం భవనం వారి ఇలవేల్పు సీతలాదేవి అమ్మవారి ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని పలు గ్రామాల నుంచి భవనం వర్గీయులు వందలాది మంది దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన చీరెలు వేలం పాట నిర్వహించారు. ఈ విధంగా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

నరసరావుపేట టౌన్: అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. రామిరెడ్డిపేట పాత ఏంజిల్ టాకీస్ వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ మౌలాలి(39) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అయితే రెండు రోజుల క్రితం మౌలాలికి అతని సమీప బంధువుల మధ్య ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో వివాదం జరిగిందని, ఈ క్రమంలో అతను మృతి చెందటంపై అనుమానాలు ఉన్నాయని మృతుడి సోదరుడు మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుమ్మర్ల సంక్షేమ సత్రం కోశాధికారి కొల్లిపాక మృతి

నాదెండ్ల: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి కుమ్మర్ల సంక్షేమ సంఘం అన్నదాన సత్రం కోశాధికారిగా పనిచేసిన కొల్లిపాక నాగేశ్వరరావు (65) ఆదివారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు, మండలాధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, సర్పంచ్ షేక్ మస్తాన్‌వలి, కిసాన్ సెల్ మాజీ అధ్యక్షుడు సుదర్శనం బాలస్వామి, నాయకులు నివాళులర్పించారు.

టీడీపీ నేతల మాయ మాటలు నమ్మొద్దు

యడవల్లి రైతులతో సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు



యడవల్లి దళిత, గిరిజన రైతులతో కలసి మాట్లాడుతున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: యడవల్లి దళిత గిరిజన రైతులు టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మొద్దని, టీడీపీ ప్రభుత్వంలో పరిహారం చెల్లించకుండానే భూములు కాజేసేందుకు వారు చేసిన కుట్రలు గుర్తు తెచ్చుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పేర్కొన్నారు. దళిత గిరిజన రైతులకు న్యాయం చేసేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని ఆయన అన్నారు. బ్యాంకు కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యడవల్లి దళిత, గిరిజన రైతులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. భూమిలేని నిరుపేదల కోసం 1975లో యడవల్లి గ్రామానికి చెందిన దళిత గిరిజన రైతులకు నాటి ప్రభుత్వం 416.5 ఎకరాల భూమిని ఏక పట్టాగా ఇచ్చిందని తెలిపారు. ఆ భూమిలో 120 మంది దళిత, గిరిజన రైతులు యడవల్లి వీకర్స్ సెక్షన్ ల్యాండ్ కాలనైజేషన్ కో-ఆపరేటివ్ సొసైటీగా ఏర్పడి సాగుచేసుకుంటున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ భూముల్లో విలువైన గ్రానైట్ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించి, సాగు చేసుకుంటున్న రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించకుండానే సొసైటీ రద్దు చేయించి, భూములు లాక్కొనే ప్రయత్నం చేసిన విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని రాజేష్ నాయుడు చెప్పారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా నేటి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వైఎస్సార్ సీపీ తరుపున ఎన్నో పోరాటాలు చేసి రైతులకు అండగా నిలిచారన్నారు. గతంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రి విడదల రజిని సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి.. పట్టాకు రూ.25లక్షల మేర పరిహారం చెల్లించి సంబంధిత భూములను ఏపీ మైనింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు. నాడు పైసా పరిహారం చెల్లించకుండా భూములు కాజేసేందుకు చూసిన టీడీపీ నాయకులు, తాము అధికారంలోకి వస్తే భూములు తిరిగి ఇప్పిస్తామని చేస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మొద్దని చెప్పారు. సంబంధిత దళిత, గిరిజన రైతులు పరిహారం పెంచి రూ.75 లక్షల మేర ఇప్పించాలని కోరుతున్న క్రమంలో ఈ నెల 27న ముఖ్యమంత్రి వద్దకు సంబంధిత రైతులను తీసుకువెళ్లి.. అదనపు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో సంబంధిత యడవల్లి దళిత, గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యడవల్లి గ్రామ సర్పంచ్ కొమిరిశెట్టి తిరుమలేశ్వరి, కొమరిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆలా పెద కోటేశ్వరరావు, రైతులు తాళ్లూరి వెంకట్రావు, వేల్పుల బుజ్జి, సాంబయ్య, కోటేశ్వరరావు, మిసాక్, పరుచూరి వంశీ, పరిశపోగు కోటేశ్వరరావు, వేల్పుల ఇజ్రాయేలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటివి విధ్వంసకర రాజకీయాలు

- వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు చించివేత దుర్మార్గం
- దళిత మహిళపై దాడికి యత్నించడం దారుణం
- టీడీపీ కార్యకర్తల వికృత చేష్టలను ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

చిలకలూరిపేట: మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావువి విధ్వంసకర రాజకీయాలని.. ఆయన అనుచరులు వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు చింపివేయడం దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. చిలకలూరిపేట పట్టణంలో టీడీపీ కార్యకర్తలు శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు చించివేయడాన్ని వారు ఖండించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్న, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి తదితర ముఖ్య నాయకులు పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. బొల్లెద్దు చిన్న మాట్లాడుతూ ప్రత్తిపాటి పుల్లారావుకు టీడీపీ సీటు కేటాయించిన రోజే టీడీపీ గుండాలు ర్యాలీ నిర్వహిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ జాతీయ రహదారిపై తమ పార్టీ ఫ్లెక్సీలు చింపివేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలన్నారు. దళిత మహిళ అని కూడా చూడకుండా సదరు దృశ్యాలను చిత్రీకరిస్తున్న చెల్లి శారదను వెంటాడి వేధించటం చూస్తే పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలు రోడ్లపై తిరిగే పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. బలాబలాలు ప్రజాక్షేత్రంలో చూసుకోవాలని, ఇలాంటి అరాచకాలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, ఎస్సీ విభాగం నాయకుడు కొచ్చెర్ల కిషోర్, కౌన్సిలర్ పిల్లి సాగర్, ఏఎంసీ సుభాని, బండారు జయకుమార్, గుంజి వీరాంజనేయులు, వడితే కోట్యానాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, ఎంపీపీ దేవినేని శంకరరావు, బిట్రా రాజేంద్రప్రసాద్, ఘంటా శంకర్, నకరికంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అల్లూరువారిపాలెంలో ఘర్షణ

పోలీసులకు ఫిర్యాదు

నరసరావుపేట రూరల్: అల్లూరువారిపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ, బీజేపీ పార్టీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. బీజేపీ ప్రజా పోరు కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని ఉప ఎంపీపీ వెంకటప్పారెడ్డి నివాసం ఎదురుగా సమావేశాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు మాట్లాడటం ప్రారంభించారు. ఆ సమయంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అడ్డుకోవటంతో వివాదం మొదలైంది. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణకు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురూ ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.